ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 01 సెప్టెంబర్ 2010

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు ~ 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

హైదరాబాద్ .... 06-08-2010

జిన్నూరు ......... 12-08-2010

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## సద్గురువు శ్రీ నాన్నగారు

### (23-09-2010 నాన్నగారి పుట్టినరోజు సుమాంజలి)

జ్ఞానసామ్రాట్ భగవాన్ శ్రీ రమణ మహర్షిచే ఎంపిక కాబడి, తన జీవితాన్ని శ్రీ రమణ బోధకు అంకితం చేసి, భగవాన్ శ్రీ రమణమహర్షి మనకందించిన జ్ఞానప్రసార మాధ్యమముగా రమణతత్త్వాన్ని మనకందిస్తూ, ఎల్లలులేని తమ విశ్వప్రేమద్వారా, అందరిచే ప్రియముగా "నాన్నగారు" అని పిలవబడే సద్గురు శ్రీ నాన్నగారు, సాధకులను ఆధ్యాత్మికంగా ప్రోత్సహిస్తూ, తనదైన శైలిలో అంతర్ముఖులను చేస్తారు. సద్గురు శ్రీ నాన్నగారు వారి సత్యానుభూతిని మరియు ప్రపంచానుభూతిని రంగరించి, సాధకుల స్థాయిని దృష్టిలో పెట్టుకొని, చక్కటి ఉపమానములతో, అతి సరళమైన భాషలో, సూటిగా బోధిస్తారు. స్వరూప ఎరుకలో నిరంతరం జీవిస్తూ, దాని ద్వారానే వ్యవహారము నిర్వహిస్తూ, ఆ పరమసత్యాన్నే అందరిలోనూ, సకలములోనూ దర్శిస్తున్న అద్వైతమూర్తి సద్గురు శ్రీనాన్నగారు. తామరాకు మీద నీటిబొట్టులా ప్రపంచంలో ఉంటూ ప్రపంచాన్ని అంటకుండా చెదరని ఆత్మవిశ్వాసము, శరణాగతికి పరమ నిదర్శనముగా నిలిచిన రూపుదాల్చిన సజీవ సచ్చిదానంద సద్గురువు శ్రీనాన్నగారు. అనేక జన్మల పుణ్యఫలితముగా అట్టి సద్గురువును మనము కలిగియున్నాము కాబట్టి, వారి జ్ఞాన బోధను ఆచరణలో పెట్టి మోక్ష ఫలాన్ని పొందాలి.

- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-8-2010, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణుడు స్వయంగా భగవంతుడు. కృష్ణుడిని పూర్ణావతారం అని అంటారు. ఈ కలియుగంలో భక్తులందరూ అర్చన చేసుకోవటానికి వీలుగా కృష్ణుడే వేంకటేశ్వరుడిగా వెలిసాడు. ఏడుకొండలపైకి వెళ్ళేవారందరూ గోవిందా, గోవిందా అని పిలుస్తారు. కృష్ణ నామాలలో గోవింద నామం చాలా ప్రసిద్ధిపొందింది. వేంకటేశ్వరస్వామి అర్చావతారం. కృష్ణుడు మనలాగ రక్తమాంసాలతో ఈ భూమి మీద తిరిగాడు. మీ ముక్కులోగాలి తిరుగుతున్నంతకాలం అభ్యాసం, వైరాగ్యం విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు. వైరాగ్యం మన మనస్సును బహిర్ముఖం అవ్వకుండా చూస్తుంది. మనస్సు స్థిరంగా ఉన్నప్పుడు మనం అభ్యాసం చేస్తే దానికి అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి లేకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. మీరు బాహ్యంగా చాలా విషయాలలో అభివృద్ధిలోనికి రావచ్చు కాని హృదయంలోనికి అంటే ఎక్కడైతే భగవంతుడు ఉన్నాడో అక్కడకు దిగటం చాలా కష్టం. మీకు లోచూపు రావటానికి గురువు సహాయం అవసరం, దైవానుగ్రహం అవసరం. ఇవన్నీ కలిసివస్తేగాని మనకు అంతర్దృష్టిరాదు. వైరాగ్యం లేకుండా, అభ్యాసం లేకుండా మీకు లోచూపు కలుగదు. చాలామందికి వైరాగ్యం తక్కువ. అభ్యాసం, వైరాగ్యం నేర్చుకొంటే వస్తాయి. మీరు నిదానంగా ఉండండి, దారి తప్పవద్దు. మీరు నిశ్చల బుద్ధితోటి, నిర్మలమైన మనస్సుతోటి పని చేస్తూ ఉంటే ఈ జన్మలోనే, ఈ శవం భూమి మీద తిరుగుతున్నప్పుడే లోపలఉన్న వస్తువు మీకు అందుతుంది. ఆ వస్తువు అందినతరువాత దానితాలుక సుఖం, శాంతి నీకు తెలుస్తాయి.

మీరు ఈ రోజు సంతోషంగా ఉంటారు, రేపు మీకు దుఃఖం వస్తుంది. ఇవన్నీ దేహానికి సంబంధించిన విషయాలు, లోకానికి సంబంధించిన విషయాలు. కాని మీకు ఆత్మసుఖం ఒక్కసారి అందితే ఇంక దానికి ముగింపు లేదు. జీవితంలో ఒక్కసారి మీరు ఆత్మశాంతిని రుచి చూసారు అనుకోండి, మనస్సు ఎంత వేగంగా బయటకు వెళుతున్నప్పటికీ ఆ అనుభవం సడన్‌గా మరల లోపలకు లాగేస్తుంది. మీ మాటలను మేము కాదనవచ్చు, మీ జీవిత విధానాన్ని మేము కాదనవచ్చు కాని మీ అనుభవాన్ని ఎక్కడ కాదనగలము. మీరు హృదయంలో అనుభవాన్ని పొందారు అనుకోండి దానిని మేము కాదు కాదు అన్నా మీకు అది స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది కదా. అది అంత స్పష్టంగా మీకు గోచరించినప్పుడు లౌకికులు మీకు ఎంత చెప్పినప్పటికీ మీకు వేవరింగ్ రాదు. ఇక్కడ పరమాత్మ కొన్ని అమృతతుల్యమగు గుణాల గురించి చెప్పి వాటిని ప్రాక్టీసు చెయ్యమని చెపుతున్నాడు. నాయందు విశ్వాసము కలిగిఉండి, నా పాదాలను ఆశ్రయించి, ఎవరైతే శ్రద్ధగా నేను చెప్పిన ఈ డివైన్ క్వాలిటీస్‌ను, గ్రేట్ క్వాలిటీస్‌ను ప్రాక్టీసుచేస్తున్నాడో వాడు నా దయకు పాత్రుడవుతాడు అంటున్నాడు పరమాత్మ. మీరు జీవకోటిపట్ల

ఎక్కడా ద్వేషం పెట్టుకోవద్దు. భౌతికంగా కొంతమంది మీకంటే ఉచ్ఛస్థితిలో ఉండవచ్చు, కొంతమంది మీకంటే వెనుకబడి ఉండవచ్చు. వారు మీకంటే ఏ రంగంలో అభివృద్ధిలో ఉన్నా వారిని చూసి మీరు ద్వేషం పెట్టుకోవద్దు. ద్వేషం వలన మనకు శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం పాడవుతుంది.

మీ బంధువులను, మీ స్నేహితులను మీరు ప్రేమిస్తున్నారు. అది సామాన్య మానవుడు కూడా చేస్తున్నాడు కదా. మీ శత్రువులను కూడా మీరు అలా ప్రేమించగలగాలి అంటే వారితో జతకట్టమనికాదు, మానసికంగా వారితో మీరు విరోధం పెట్టుకోనక్కరలేదు. సామాన్య మానవుడు చేసే పనినే మీరూ చేస్తూఉంటే ఇంక మీరు భక్తులు ఎలా అవుతారు. సామాన్య మానవుడు చేయలేని పని మీరు చెయ్యగలగాలి. ప్రాక్టీసు చేస్తూ ఉంటే అసాధ్యం కూడా సాధ్యమవుతుంది. విరోధుల పట్ల కూడా ద్వేషభావన వద్దు. ఎవరైనా మనలను శత్రువులు అనుకోవచ్చుకాని, వారు మాకు శత్రువులు అని మీరు అనుకోకూడదు. మీరు అందరిపట్ల దయ కలిగి ఉండండి, క్రూరత్వం పనికిరాదు. వారు ఎటువంటి వారు అయినా ఒకవేళ బాహ్యంగా వారు మీకు కొన్ని అపకారాలు చేసినప్పటికీ మీ మనస్సులోమటుకు వారి క్షేమం కోరుకోండి. దానివలన మీకు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది, మీకు స్పిరిట్యువల్ స్టేటస్ వస్తుంది. అంటే మీరు ఎవరినైతే ప్రేమిస్తున్నారో వారు మీకు ఏమీ ఇవ్వనక్కరలేదు, మీకు భగవంతుడే మార్కులు వేస్తాడు. అందుచేత భగవంతుడు చెప్పినట్లు మనం చెయ్యాలి. భగవద్గీతలో మనం చేయవలసిన పనులు గురించి, చేయకూడని పనులు గురించి పరమాత్మ చెప్పాడు. అందుచేత మనం చేయకూడని పనుల జోలికి వెళ్ళవద్దు, చెయ్యవలసిన పనులు చేస్తూ ఉండండి. మన ఆలోచన పాజిటివ్‌గా ఉండాలి కాని, నెగిటివ్‌గా ఉండకూడదు. మనం ఎంతమంచిపని చేసినా సమాజంలో నుండి విమర్శలు వస్తూ ఉంటాయి. సమాజంలో విమర్శలు చూసి మీరు కంగారుపడితే మీ మీద మీకు నమ్మకంలేదు అని అర్థం. మన మీద మనకి నమ్మకం లేకపోతే మనం ఏ పనీ చేయలేము. డూ గుడ్ బీ గుడ్ అని స్వామి శివానంద చెప్పేవారు. డూ గుడ్ కంటే బీ గుడ్ కష్టం. మీరు మంచి చెయ్యటం తేలికే. మంచి చెయ్యటం కంటే మంచిగా ఉండటం కష్టం. జ్ఞానానికి మరో పేరే మంచితనం. నీలో నిజమైన మంచితనం ఉంటే అది ఆత్మజ్ఞానముతో సమానమని సోక్రటీస్ చెప్పాడు. నీకు బాహ్యంగా ఆస్తులు ఉండవచ్చు. చదువు ఉండవచ్చు. బంధుబలం ఉండవచ్చు. వాటితో తాదాత్మ్యం పొంది గర్వం తెచ్చుకోవద్దు. ఎందుచేతనంటే ఆ పరిస్థితులు ఉండగా మనమైన చనిపోతాము. ఒకోసారి మనం ఉండగా ఆ పరిస్థితులన్నీ మారిపోవచ్చు. కాలగర్భంలో ఏమి ఉంటుందో మనం చెప్పలేము.

మన మాట సౌమ్యంగా ఉండాలి. మాట నిగ్రహంగా ఉండాలి. మనం నేర్చుకో వలసింది ఏమిటి అంటే భగవంతుడు మనకి వాక్కు ఇచ్చాడని దానిని నియమరహితంగా ఉపయోగించ కూడదు. నియమబద్ధంగా వాక్కును ఉపయోగించ గలగాలి. నీ వాక్కుని, నీ చేతనీ, నీ

మనస్సునీ, శాస్త్రానికి అనుగుణంగా ఉపయోగించుకొంటే అది తపస్సుతో సమానము. మాకు అన్నీ తెలుసును అని ఎవరూ అనుకోవద్దు మనం సర్వజ్ఞులం కాదు. ఈశ్వరుడు ఒక్కడే సర్వజ్ఞుడు. మీ దగ్గర డబ్బులేదు, అధికారం లేదు అయినా మిమ్మల్ని చూడటానికి చాలామంది ఎందుకు వస్తున్నారు అని సోక్రటీస్‌ని అడిగారు. నాకు ఏమి తెలియదన్న సంగతి నాకు తెలుసు. వాళ్ళకి కూడా తెలుసు కాబట్టి వాళ్ళు నన్ను చూడటానికి వస్తున్నారు అని చెప్పాడు. సోక్రటీస్ లాంటి గ్రేట్ ఫిలాసఫర్ అలా అంటే ఇంక మనకి ఏమి తెలుసును. మనకి ఏమి తెలియకుండా తెలుసును, తెలుసును అంటే మీకు దేహాభిమానం పెరుగుతుంది. అహంకార రహితస్థితికి ఎదిగిరావటానికి ప్రయత్నం చెయ్యండి. నిరహంకారుడు మాట్లాడుతూ ఉన్నా వాడి రచన అయిన అక్కడ మనిషి కనపడడు. సబ్జెక్ట్ కనబడుతుంది. అంటే 100% సబ్జెక్టు ప్రధానంగా ఉంటుంది కాని ఫలానా వాడు చెప్పాడు అని మీరు అనుకోవాలని వాడు అనుకోడు. అది నిరహంకారస్థితి. మాకు ఈ అరుణాచలానికి సంబంధం ఏమిటి మిమ్మల్ని బట్టి మేము అరుణాచలం వచ్చాము అని ఎవరైనా భగవాన్‌తోటి అంటే మీరు నన్ను బట్టి వచ్చారు. నేను ఎవరిని బట్టి వచ్చాను. ఏ ఈశ్వరుడు అయితే నన్ను ఇక్కడకు తీసుకొని వచ్చాడో ఆయనే మిమ్మల్ని కూడా తీసుకొని వచ్చాడు. నేను ఎవరిని? మిమ్మల్ని ఇక్కడకు తీసుకొని రావటానికి అనేవారు. మనం నేనును నీళ్ళవాడకం కంటే ఎక్కువగా ఉపయోగిస్తాము. కొంతమంది ఈ నేనును అసలు అప్లై చెయ్యరు. నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో అది నువ్వు కాదు, నువ్వు కాదని నీకు తెలియటంలేదు. ఈ నేను నేను కాదు అని తెలిసేవరకూ నీకు అమృతానుభవం కలుగదు అని రామకృష్ణుడు చెప్పారు.

నేను ఉంటే అన్నీ ఉన్నాయి పుణ్యం ఉంది, పాపం ఉంది, ధర్మం ఉంది, అధర్మం ఉంది, చనిపోయిన తరువాత స్వర్గం ఉంది, నరకం ఉంది, నిన్ను శిక్షించేవాడు ఒకడు ఉన్నాడు. మొత్తం ఈ క్రియేషన్ అంతా నేను అనే ఒంటి స్థంభం మీద ఆధారపడి ఉంది అని భగవాన్ చెప్పేవారు. ఈ నేనుతో నీకు అనేక జన్మల నుంచి తాదాత్మ్యం ఉంది అందుచేత ఈ నేను నేను కాదని డౌట్ చేయటంలేదు. ఈ ఫాల్స్ ఐని నువ్వు నూటికి నూరుపాళ్ళు నిజం అనుకొంటున్నావు కదా. దాని యొక్క నిస్సారతను తెలియజేయటానికి గురువు అవసరం. అందులో ఏమీ లేదని నీకు తెలిసాక దానిని నువ్వు షేక్ చేస్తావు. అదే నిజం అనుకొన్నప్పుడు దానిని తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేయలేవు. అదే మాయ. మాయ అంటే ఎక్కడో లేదు మనం నిజంకానిదానిని నిజం అని నమ్ముతున్నాము అదే మాయ. మనకు ఏదైనా పోయింది అనుకోండి పోయింది పోయింది అనుకొంటే సారో పెరిగిపోతుంది. ఆ పోయింది మనదికాదు అనుకొంటే మనస్సు అక్కడ ఆగిపోతుంది. మనుషులు అందరూ బెంగలు పెట్టుకోవటానికి, ఏడుస్తూ మంచాలు పట్టటానికి మమకారమే కారణం. మమకారం లేకపోతే ఎవరికోసం ఏడుస్తారు. ఇది మనకు పైకి కనబడదు, దీని వలన లోపల బరువులు

మోస్తూ ఉంటాము. అంటే మమకారానికి ఎంత లోతు ఉందో, దానివలన మనం ఎంత పతనమవుతున్నామో చూసుకోవాలి. అందుచేత మనం డ్యూటీ చేయాలి అంతే. మమకారం పెట్టుకోకూడదు. మనం చేతులతో పనిచేస్తున్నా మన మనస్సు ఈశ్వరుడిమీదే ఉండాలి, ఈ జీవకోటికి తండ్రి ఈశ్వరుడే. అందుచేత ఈశ్వరుడిలో మీరు ఐక్యమయ్యేవరకూ ఈ లోపుగా మీరు ఎన్నిసార్లు చనిపోయినా, ఎన్నిసార్లు పుట్టినా, ఎన్ని కష్టసుఖాలు అనుభవించినా, ఆయనను చేరుకొనే వరకూ మీకు విశ్రాంతి లేదు. ఒకోసారి ఎవరి గురించి అయితే మీరు జీవితం పొడుగునా కష్టపడ్డారో, మీరు మంచం పట్టాక వారు అన్నం కూడ పెట్టరు. అలాగని వారిని చూడవద్దని కాదు. మీ డ్యూటీ చెయ్యాలి. ఈశ్వరుడే మన నిజమైన తండ్రి. ఈశ్వరుడిని మన మనస్సులో మరచిపోకూడదు. అది గుర్తు పెట్టుకోండి.

మనం ఎవరి గురించి బెంగలు పెట్టుకోకూడదు. మనం పనికిరాని వాళ్లందరిని జ్ఞాపకం పెట్టుకుంటున్నాము ఈశ్వరుడిని వదిలేస్తున్నాము. మనం పవిత్రులం అవ్వటానికి ప్రయత్నం చెయ్యాలి. ఆరోజుకారోజు, ఆ జన్మకాజన్మ పవిత్రం అవ్వటానికి ప్రయత్నం చేస్తుంటే, సత్‌కర్మ చేస్తూ ఉంటే అప్పుడు మనకి ముముక్షత్వం వస్తుంది. ఇప్పుడు మనకి శరీరం వచ్చింది. ఈ మానవ శరీరాన్ని వృథా చేసుకోవద్దు. రెండు కాళ్ల పసువు కింద ఉండవద్దు. జ్ఞానసముపార్జన కోసం ప్రయత్నం చేయి. జ్ఞానం సంపాదించాలి అనేటటువంటి జిజ్ఞాస ఉంటే సరిపోదు. దానికి మహాత్ముల సహవాసం కూడా అవసరం. ఇన్ని రకాలుగా నీకు కలిసి రావాలంటే పూర్వపుణ్యం లేకుండా అది మీకు సాధ్యంకాదు. అది ఏవో మాటల వల్ల వచ్చేది కాదు. తల్లి కడుపులోనుండి బయటకి వచ్చింది మొదలు స్మశానానికి వెళ్లేవరకు ఎవరిరోజులు ఒకేరకంగా వెళ్లవు. అందరి జీవితాలలో హెచ్చుతగ్గులు ఉంటాయి. ఈ శరీరానికి చావు ఎప్పుడు వస్తుందో ఎలా వస్తుందో మనం చెప్పలేము. అది నిర్ణయింపబడే ఉంటుంది. శరీరానికి చావు ఎప్పుడు వస్తుంది అనేది ముఖ్యం కాదు. నువ్వు ఈశ్వరుడిలో ఐక్యమవ్వటానికి ఎంతవరకూ కృషి చేస్తున్నావు అనేదే ముఖ్యం. కొంతమంది ఎన్నాళ్ళు బ్రతికినా ఏదో తింటూ తిరుగుతూ ఉంటారు కాని వారికి సాధన ఏమి ఉండదు. వారు భౌతికానికి పనికిరారు. ఆధ్యాత్మికానికి పనికిరారు. ప్రారబ్దాన్ని బట్టి ఒకోసారి నీకు దుఃఖం వస్తూ ఉంటుంది. ఒకోసారి సుఖం వస్తూ ఉంటుంది. అవి ప్రారబ్దం తీసుకువచ్చే గొడవలు. వాటిని చూసి నీ బ్రెయిన్‌లో ఉన్న బేలెన్స్ పోగొట్టుకోవద్దు. నీ జీవితంలో హెచ్చుతగ్గులు, వచ్చినప్పటికి నువ్వు ఓర్పు కలిగి ఉండు. నీ నిదానంలో నువ్వు ఉండు. నిన్న నా దగ్గరకు ఒక వ్యాపారస్తుడు వచ్చాడు. ఏమండీ మీరు హేపీగా ఉన్నారా అని అడిగాను. నాకు లాభాలు వస్తూ ఉంటాయి, నష్టాలు వస్తూ ఉంటాయి. ఇది వ్యాపారం కదా. నష్టం వచ్చిందని ఎప్పుడూ నేను దుఃఖపడటంలేదు అని చెప్పారు. ఆయన చెప్పినది కరక్టే. ఆయన అలా అలవాటు చేసుకున్నారు. ఈ పైసలకోసం రోజూ ఎక్కడ బెంగపెట్టుకుంటారు. డబ్బు వస్తూ

ఉంటుంది. పోతూ ఉంటుంది. దానికోసం మన మనస్సుని పాడుచేసుకోవటం ఎందుకు? ఈ సుఖ, దుఃఖాలు ఇవన్నీ ఎమోషన్స్. ఈ సుఖ దుఃఖాలు ఎక్కువ అవుతున్నాయి అనుకోండి అప్పడు మీ స్వరూపానికి మీరు దూరమైపోతారు.

నీ మనస్సును నువ్వు బాగు చేసుకో. ఒకవేళ అలాగ బాగుచేసుకోలేవు అనుకో నాకు ఇచ్చేస్తే నేను బాగుచేసి పెడతాను అంటున్నాడు పరమాత్మ. ఆయనకు ఇవ్వటం అంటే ఏమిటి ఆయన మాటయందు గౌరవం కలిగి ఉండటం. ఆయన చెయ్యమని చెప్పిన పనిని చెయ్యటం, వద్దని చెప్పిన పని జోలికి వెళ్ళకుండా ఉండటం. నిరంతరం ఆయనను జ్ఞాపకం పెట్టుకోవటం. నువ్వు నిరంతరం ఈశ్వరుడిని స్మరించుకుంటున్నావు అనుకో అది కూడా యోగమే. నువ్వు నిరంతరం నామాన్ని జపించుకొంటూ ఉంటే నువ్వు పవిత్రుడవు అవుతూ ఉంటావు. నీ మనస్స నియమింపబడుతుంది నువ్వు బాడీకి కంఫర్ట్ కోరుకుంటున్నావు కాని, మైండ్‌కి కంట్రోలు కూడా అంతే అవసరం అని నీకు తెలియటంలేదు. కొంతమందికి భగవంతుడు అన్నీ ఇచ్చినా ఏడుస్తూ ఉంటారు. వారికి సంతృప్తి అనేది ఉండదు. మనిషి అయ్యాక సంతృప్తి ఉండాలి. మీరు గ్రహించవలసింది ఏమిటంటే కోరికలను నెరవేర్చుకుంటూ కోరికలను జయించినవాడు ఇంతవరకూ ఈ సృష్టిలో ఎవడూ లేడు. ఇది గుర్తు పెట్టుకోండి. నాకు ఒక కోరిక ఉంది. ఆ కోరిక నెరవేరింది అంటే ఆ నెరవేరిన కోరిక ఇంకో కోరికను తీసుకొని వస్తుంది. దానికి ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పెట్టాలికదా. అందుచేత ఏదో ఒక పాయింట్‌లో మీకు సంతృప్తి ఉండాలి. నీకు అసలు సంతృప్తి కలగటంలేదు అనుకో ఇంక నీకు అంతర్‌దృష్టి రాదు. అంతర్‌దృష్టి రాకపోతే నీకు ఆత్మజ్ఞానం కలుగదు. అందుచేత ఏదో ఒక పాయింట్‌లో నువ్వు సంతృప్తి చెందటం నేర్చుకో. ఈ సృష్టిని నియమించేవాడు ఒకడు ఉన్నాడు. ఆ విషయంలో మీకు విశ్వాసం దృఢంగా ఉండాలి. అంటే భగవంతుడి పట్ల నువ్వు విశ్వాసం కలిగి ఉండాలి. నువ్వు కృతజ్ఞుడిగా ఉండాలి కాని కృతఘ్నుడిగా ఉండకూడదు. మనం మనస్సుని విషయచింతనకు అర్పిస్తాము. విషయచింతనకి మనస్సుని అర్పిస్తే నీ బ్రెయిన్ అంతా పాయిజన్ అయిపోతుంది. ఇక్కడ నీకు అమృత తుల్యమగు ధర్మాన్ని చెపుతున్నాను అని పరమాత్మ చెపుతున్నాడు. నీ మనస్సుని నాకు అర్పిస్తే నిరంతరము నా రిమెంబరెన్స్‌లో నువ్వు కనుక ఉంటే నన్ను పొందుతావు. మనం భగవంతుడు చెప్పిన పని చేయాలి. ఆయన వద్దని చెప్పిన పని మానేయాలి. ఆర్గ్యుమెంట్స్ వద్దు అది శరణాగతి. ఆ శరణాగతి ధర్మం లక్ష్మణుడి దగ్గర ఉండేది. మీరు అనిజంలో నుండి నిజంలోనికి, మృత్యువులో నుండి అమృతత్త్వములోనికి వెళ్ళాలంటే మీ మనస్స మీకు సహకరించాలి. మీరు ఏరకంగా ఉంటే మీ మనస్స మీకు సహకరిస్తుందో ఆ లక్షణాలను పరమాత్మ ఇక్కడ చెపుతున్నాడు. ఇతరులు ఎవరైనా నిన్ను క్షోభపెడుతూ ఉంటే నువ్వు క్షోభపడవద్దు, భయపెడుతూ ఉంటే భయపడవద్దు. అదేవిధంగా నువ్వు

ఎవరినీ క్షోభ పెట్టువద్దు, భయపెట్టవద్దు. ఈ రెండు మాటలు చాలా ముఖ్యం. నువ్వు నిర్మలంగా ఉండు. ఎదుటివారిని కూడా నిర్మలంగా ఉంచటానికి ప్రయత్నం చెయ్యి.

ఎదుటవారి గొడవ నీకు వద్దు. నీ మనస్సులో ఏముందో తడుముకొని ఇప్పుడు నేను చెప్పిన కారణాలు ఏమైనా ఉంటే జాగ్రత్తగా వాటిని తొలగించుకో. నువ్వు లోక విషయాలను చూసి పొంగిపోకు. సమానంగా ఉండటం నేర్చుకో. నీకు ఏమైనా అనుకూలమైన పరిస్థితులు ఉంటే పొంగిపోకు. నీకంటే ఇతరులకు ఏమైనా అనుకూలమైన పరిస్థితులు వస్తే అసూయపడకు. ఈ శరీరములో నుండి బయటకు రావటానికి మీరు ఏమి సాధన చేయనక్కరలేదు. చావే మిమ్మల్ని ఈ శరీరము నుండి విడుదల చేస్తుంది. ఈ శవము ఉండగానే మీరు సాధన చేసి రాగము, భయము, ద్వేషము, అసూయ వీటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యండి. మీకు ఎప్పుడైనా భయము వేస్తోందా అని భగవాన్‌ను అడిగితే ఈ భూమి మీద ఏముంది భయపడటానికి అన్నారు. అక్కడ అసలు ద్వితీయము ఉంటే కదా. మీరు ఏ విషయం గురించి బెంగపెట్టుకోవద్దు. ఎందుచేతనంటే మీరు ఏ విషయాన్ని గురించి అయితే బెంగపెట్టుకుంటున్నారో అది భవిష్యత్‌లో మీ మంచికి కారణం అవ్వవచ్చు. అది మీకు తెలియక కంగారు పడుతున్నారు. ఈ లక్షణాల గురించి ఇంత గట్టిగా ఎందుకు చెపుతున్నారు అంటే మీరు 100 కోట్లు సంపాదించిన మరణానంతరం నీకూడా ఒక్క రూపాయి కూడా రాదు. కాని ఈ గుణాలు సంపాదించుకుంటే అన్ని గుణాలు మరణానంతరము నీకూడా వచ్చేస్తాయి. మీకు జ్ఞానోదయం అయ్యేవరకు అవి మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాయి. అందుచేత మరణానంతరం నీకూడా వచ్చే ఈ క్వాలిటీస్‌ని ప్రాక్టీసు చేయమని ఇక్కడ భగవంతుడు చెపుతున్నాడు.

నీ పొట్టకి ఇతరుల మీద ఆధారపడవద్దు. అలా ఆధారపడితే నీ పొట్టకు అన్నము పెట్టి వాళ్ళు చెప్పినట్లు వినమంటారు. నీకు ఫ్రీడం ఇవ్వరు. నీ ఫ్రీడం పోగొట్టుకొని వారు అన్నము పెడుతున్నారు అని రోజూ వారు చెప్పినట్లు ఎక్కడ వింటారు. అందుచేత మీ పొట్టకి సరిపడా మీరు సంపాదించుకొంటూ, అతిగా వెళ్ళకుండా భగవంతుడు చెప్పిన గుణాలను ప్రాక్టీసు చెయ్యటం ప్రారంభించండి. అంతేగాని నీ పొట్టకి బట్టకి ఇతరులమీద కాని మీ ఇంట్లోవారి మీద కాని ఆధారపడకండి. అలా ఆధారపడితే ప్రమాదం ఏమిటి అంటే వారు పైకి ఏమీ అనక పోయినా లోపల మిమ్మల్ని బానిసలుకింద చూస్తారు. ఇది భగవాన్ ఉవాచ. బానిసత్వం అంటే వారు ఏమి చెపితే అది చేయాలి. అంటే మనకు ఫ్రీడం పోతుంది. ఫ్రీడం పోతే ఇంక మీరు సాధన చేయలేరు. మనం బయట శుచి బాగానే చూసుకొంటున్నాము. కాని మనకు లోపల శుచి లేదు. మీరు బయట ఎంత శుచిగా ఉంటున్నారో లోపల కూడా అంత శుచిగా ఉండాలి. లోపల శుచి ఏదో సబ్బుపెట్టి రుద్దితే వచ్చేది కాదు. ఈశ్వరుడిని నిరంతరం చింతించటం వలన సత్పురుషుల సహవాసం వలన లోపల శుచి వస్తుంది. మనం ఒక పని

చేసినప్పుడు దాని వలన భౌతికంగా ఇతరులకు కొంత సహాయం అందాలి. అదే పని లోపల మనం పవిత్రులం అవ్వటానికి ఉపయోగపడాలి. అంటే లోపల చైతన్యస్థాయి పెరుగుతూ ఉండాలి. అంతేగాని బయట ఏదో సహాయం చేసి మనం గర్వాన్ని పెంచుకోకూడదు. ఒట్టి మాటలు కట్టిపెట్టు గట్టి మేలు తలపెట్టు అంటే నీ పెదాలతోటి సింపతీ వద్దు. ప్రాక్టికల్‌గా నువ్వు మనుషులకు ఏదో ఒకటి చెయ్యి. ఎవరైనా మనకి చెడ్డ చేసారు అనుకోండి క్షమించటం తేలిక. కాని దానిని మరచిపోవటం చాలా కష్టం. మీకు ఎవరైనా అపకారం చేసారు అనుకోండి మీలో చాలామంది తిరిగి అపకారం చెయ్యరు. కాని వారు నాకీ అపకారం చేసారు అనే జ్ఞాపకం నీకు పోదు. అది కూడా మరచిపోవటం నేర్చుకోండి. దానిని మరచిపోరు అనుకోండి అది వాసన కింద పడిపోతుంది. మీరు అన్నం తింటే మీ బాడీకి ఇంధనం ఎలా తయారు అవుతుందో ఇవన్నీ జ్ఞాపకాలు పెట్టుకొంటే మీ ఈగోకి ఇంధనం తయారవుతుంది. ఇంద్రియవిషయాల పట్లకాని దేహానికి సంబంధించిన విషయాల పట్ల కాని అపేక్ష పెట్టుకోవద్దు. వచ్చేది వస్తూ ఉంటుంది. పోయేది పోతూ ఉంటుంది. అందని పండు కోసం ఆశించకు.

మీరు బెంగలు పెట్టుకోవద్దు. ఏడుస్తూ కూర్చోవద్దు. దేనికోసం బెంగ? ఎవరికోసం బెంగ? ఎవరు ఎవరికీ ఏమీ కారు. అది అల్టిమేట్. ఊరికే మీ మనస్సు ఏదో క్రియేట్ చేస్తూ ఉంటుంది. మీరు డ్యూటీ చెయ్యండి కాని ఎవరి గురించి బెంగపెట్టుకోవద్దు. సాధ్యమైనంతవరకూ కామ్యకర్మలు తగ్గించుకోండి. అంటే కోరికతో చేసే పనులు తగ్గించుకోండి. 24 గంటలు మీకు లాభం వచ్చే పనులు చేయటం కాదు. ఇతరులకు ఉపయోగపడే పనులు కూడా చేయండి. ఈ పని చేస్తే మనకి ఏమి కలసి వస్తుంది. ఆ పని చేస్తే మనకి ఏమి కలసి వస్తుందని 100% సెల్ఫ్ సెంటర్డ్‌గా ఉండవద్దు. మీరు 24 గంటలు కామ్యకర్మలే చేస్తారు అనుకోండి ఇతరులకు ఉపయోగపడే కర్మ ఒకటి కూడా చేయరు అనుకోండి దానివలన లోపల శుచిరాదు. ఎక్కడైనా ఏదైనా పేచీ వచ్చిందనుకోండి ఆ పేచీని పెంచేయటానికి కొంతమంది ఒక ప్రక్కకు కొంతమంది వేరే ప్రక్కకు వెళ్ళిపోతారు. మీరు అలా ఏదో ఒక ప్రక్కకు పోకుండా ఆ పేచీ ఎందుకు వచ్చిందని నిర్మలంగా ఆలోచించి మీరు ఏదైనా చేయగలిగితే చెయ్యవచ్చు. లేకపోతే మీరు పూరక ఉండండి. అంతేగాని అక్కడ ఏమి జరుగుతోందో తెలుసుకోకుండా ఎవడో ఒకడి కొమ్ము కాసేయకండి. దాని వలన మనస్సు పొల్యూట్ అయిపోతుంది. ప్రతీ మనిషికి శత్రువులు, మిత్రులు ఉంటారు. కొంతమంది అకారణంగా శత్రుత్వం పెట్టుకుంటారు. దానికి కారణం చెప్పలేరు. మీకు ఇటువంటి గొడవలు వద్దు. నువ్వు సమానముగా ఉండు. నీ మానసిక ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. ప్రతీ మనిషికి ఒకో సందర్భంలో గౌరవం వస్తుంది. ఒకో సందర్భంలో అగౌరవం వస్తుంది. అది సహజం. గౌరవాన్ని, అగౌరవాన్ని సమానంగా తీసుకో. నువ్వు ఈ భూమి మీదకు ఏపని మీద వచ్చావో ఆ పని చూసుకో. బయట గొడవలను బయటే

వదిలెయ్యి. వాటిని లోపలకి తీసుకొని క్షోభపడవద్దు.

ఎక్కడ ఆసక్తి పెట్టుకోవద్దు. కుటుంబ సభ్యుల పట్లగాని, బయటవారి పట్లగాని నీ డ్యూటీ చెయ్యాలి గాని ఎక్కడా ఆసక్తి పెట్టుకోకూడదు. నువ్వు ఆసక్తి పెట్టుకొంటే అది బంధం కింద మారిపోతుంది. దానివలన నెమ్మదిగా నీ మనస్సు పాయిజన్ అయిపోతుంది. నిన్ను ఎవరైనా స్తోత్రం చేసారు అనుకో దానిని లోపలకు తీసుకోవద్దు. అలా లోపలికి తీసుకుంటే నాకేదో గ్రేట్‌నెస్ వచ్చేసింది అని నువ్వు అనుకుంటావు. నిన్ను ఎవరైనా నిందించినా దానిని కూడా లోపలకి తీసుకోవద్దు. ఇవన్నీ బయటగొడవలు. నిన్ను స్తోత్రాలు చేసేవారు, విమర్శించేవారు కూడా ఉంటారు. వాటిని ఎలా బేలెన్సు చేసుకోవాలో నేర్చుకో. అరుణాచలంలో ఒకాయన భగవాన్‌ని సోత్రం చేస్తూ పద్యాలు వ్రాసి భగవాన్ దగ్గరకు పట్టుకొని వచ్చారు. అవన్నీ భగవాన్ విన్నారు. నేను చాలా గ్రేట్‌మేన్ అని వ్రాసావు. నేను గొప్పవాడిని అయితే నీకేమి కలసి వస్తుంది. నువ్వు బాగుపడేవిధానం చూసుకో అన్నారు భగవాన్. ఎంత నేచురల్‌గా చెప్పారో చూడండి. నా గురించి గొప్పలు చెప్పటం కంటే నువ్వు అభివృద్ధిలోనికి రావటం గురించి, నువ్వు పవిత్రుడవు అవ్వటం గురించి ఆలోచించుకోమని చెప్పారు. అది జ్ఞాని లక్షణం. నీ బుద్ధి స్థిరంగా ఉండాలి. మీరు బాగుపడండి అని మేము చెప్పటం వేరు. మనం బాగుపడాలి అని మీ హృదయంలోంచి మీకు రావటం వేరు. మనం బాగుపడాలి అని మన హృదయంలో నుంచి వస్తూ ఉంటే అప్పడు మీరు ఎక్కువ కృషి చేస్తారు. తొందరగా అభివృద్ధిలోనికి వస్తారు. ప్రత్యేకంగా ఒక ప్లేసు మీద మీకు ఎటాచ్‌మెంట్ అక్కరలేదు. మీ అభివృద్ధికి, మీ శాంతికి భంగం కలిగినప్పడు మీరు ప్లేసు మార్చుకోవచ్చు. అక్కడ మీ సాధన ముఖ్యం. మీ అభివృద్ధి ముఖ్యం. మీరు జ్ఞానం పొందటం ముఖ్యం. అంతేగాని ఆ ప్లేసులోనే ఉండాలని మీరు అనుకోనక్కరలేదు. ఒకో వాతావరణంలో మనం కష్టపడి సంపాదించుకొన్నది పోతుందేమో అనిపిస్తుంది. అటువంటప్పడు ఆ ప్లేసు ఛేంజ్ అయినా అందులో పొరపాటు లేదు.

అర్జునా ఇప్పడు నేను చెప్పినవన్నీ ప్రాపంచిక గొడవలు కింద కనిపిస్తున్నాయి. పైకి మామూలు మాటలకింద చెప్పిన ఇది ధర్మామృతం. అమృతస్థితికి తీసుకుని వెళ్ళే ధర్మాన్ని నీకు బోధిస్తున్నాను. అయితే నా పట్ల నీకు ప్రేమ లేదు అనుకో, భక్తి లేదు అనుకో. ఇంతవరకూ నీకు చెప్పింది ఏది నిలబడదు అంటున్నాడు పరమాత్మ. అమృతస్థితి అంటే శరీరము మరణించినప్పటికి నాకు మరణము లేదు అనేది నీకు అనుభవానికి అందాలి. ఇప్పడు నేను ఉన్నానని ఎంత నేచురల్‌గా అనుకుంటున్నావో శరీరము పోయినా నేను ఉంటాను అనే బుద్ధి అంత నేచురల్‌గా నీకు రావాలి. అప్పడు నీకు బతికి ఉండటానికి, చనిపోవటానికి ఉన్న తేడా పోతుంది. ఎప్పడైతే ఆ తేడా పోయిందో నీకు భయం పోతుంది. ఆ తేడా ఎవడికైతే పోయిందో వాడు అమృతతుల్యుడు. ఇది ప్రాక్టికల్‌గా చెప్పిందే కాని ఇందులో

కల్పితం ఏమీ లేదు. ఈ మాటలు మనకు అర్థంకాక అవి కల్పితం కింద, అబద్ధం కింద మనకు అనిపిస్తాయి. భగవంతుడు ఎందుకు అబద్దాలు చెపుతాడు. ఆయన పట్ల మనకు గౌరవం లేనప్పడు ఆయన చెప్పిన మాటల మీద కూడా మనకు విశ్వాసం కలుగదు. మనలో దైవీసంపద లేనప్పడు సాక్షాత్తు భగవంతుడే రూపం ధరించి వచ్చి మనకు టీచింగ్ చెప్పినా అది నిలబడదు. భగవంతుడు ఉన్నాడనే నమ్మకం మనకు లేనప్పడు ఆయన చెప్పిన మాటల మీద మనకు గౌరవం ఎలాగ కలుగుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-8-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు చెప్పింది భగవద్గీత. కృష్ణుడు తల్లి దేవకీదేవి అని, తండ్రి వసుదేవుడు అని మనం అనుకొంటాము. ఆయన దేవకీదేవి గర్భంలో శరీరం ధరించలేదు. నా గర్భంలోనే జన్మించాడు అని దేవకీదేవి అనుకొనేలా చేసాడు. ఆయన శరీరం కర్మనిబట్టి రాలేదు, అవసరాన్ని బట్టి ఆయన శరీరాన్ని ఆయనే సృజించుకొన్నాడు. ఆయన స్వయంగా నారాయణుడు. కృష్ణుడు ఏ ఆత్మసుఖాన్ని అయితే పొందమని చెప్పాడో, ఏ సుఖంలోనికి మనల్ని మేల్కొలపటానికి ప్రయత్నం చేస్తున్నాడో ఆ సుఖం ధనం వల్లకాని, కీర్తివల్లకాని, అధికారం వల్లకాని, పాండిత్యం వల్లకాని రాదు. దానికి ఆచార్యుడి అనుగ్రహం ఉండాలి, ఈశ్వరుడి దయ ఉండాలి. ప్రపంచంతోటి, పంచభూతాలతోటి, ఇంద్రియాలతోటి, చావు పుట్టుకలతోటి సంబంధం లేనటువంటి శాంతిని, సుఖాన్ని పొందటం కోసం మీకు ఈ ప్రవచనాలు ఉపయోగపడాలనే మా ఉద్దేశ్యం. అంతకంటే ఇంకో ప్రయోజనం ఏమీలేదు. ఆత్మసుఖము బయట ఎక్కడో లేదు అది నీ హృదయములోనే ఉంది. మీరు ఏదో చేయటం వలన డబ్బు సంపాదించుకోవచ్చు, డిగ్రీ సంపాదించుకోవచ్చు, అధికారం సంపాదించుకోవచ్చు వీటి వలన ఆస్థితికి చేరుకోలేరు. నీ మనస్సుని, ఇంద్రియాలను శాంతపరుచుకొని, నీ బుద్ధిని ఏకాగ్రం చేసుకొని, తిండి దగ్గర బహుజాగ్రత్తగా ఉండి, మీ శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కాపాడుకుంటేనే కాని ఆ స్థితికి మీరు చేరుకోలేరు అని ఆచార్యుల వారు చెప్పారు. మీకు మీ దేహముతోటి, మీ మనస్సుతోటి ఎంత తాదాత్మ్యం ఉన్నా, మీకు ఎంత ఇష్టం ఉన్నా ఆ రెండూ మీరు కాదు. ఇంకా వీటి లోపల ఒక సత్యము ఉంది. అక్కడ నుంచే సృష్టి వస్తోంది, జీవకోటి వస్తోంది. అది అంతటా ఉంది, మీ హృదయములో కూడా ఉంది. అక్కడకి మీరు మేల్కొవాలి, మిమ్మల్ని శాంతిసముద్రంలోనికి, సుఖసముద్రంలోనికి ప్రవేశ పెట్టటానికే ఈ ప్రవచనాలు, రచనల ప్రయోజనం అని ఆచార్యులవారు చెప్పారు.

ఈ నామ రూపాలన్నీ వికారాలు, ఎక్కడైతే ఆకారం ఉందో అక్కడ వికారం ఉంటుంది. స్వప్నం నిద్రలో వస్తుంది, జాగ్రదవస్థ అజ్ఞానంలో వస్తుంది. దానికీ, దీనికీ తేడా ఏమీ లేదు. స్వప్నంలో కనిపించే మనుషులు, స్వప్నంలో జరిగిన సంఘటనలు మీకు జాగ్రదావస్థలోకి

వచ్చాక కనబడవు, ఆ సంఘటనల ప్రభావం కూడా మీ మీద ఉండదు, అలాగే మీకు జ్ఞానం కలిగిన తరువాత ఈ లోకంలో ఉన్నటువంటి మనుషులు, జరిగిన సంఘటనలు కూడా అంతే. అందుచేత మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా స్వప్నమే, ప్రతికూలంగా ఉన్నా స్వప్నమే కాబట్టి ఈ లోకంలో మీరు పొంగిపోయేది ఏమీ లేదు, మీరు కుంగిపోయేది ఏమీ లేదు. దేహం ఈ సృష్టిలోకి ఏ పని మీద వచ్చిందో ఆ పని అయిపోయిన తరువాత బూడిద అయిపోతుంది. అందుచేత ఆ దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మీ లోపల ఉన్న పరమాత్మని చేరుకోవటమే మీ గమ్యం. అది తప్పించి మీరు ఏది సాధించినా స్వప్న సమానం. భగవద్గీతలో ఒక్క శ్లోకం మీకు అర్థమైతే మీ శోకం పోతుంది. నువ్వు మనస్సుతోటి తాదాత్మ్యం పొందినంత కాలం భగవద్గీతలో చెప్పింది నీకు అవగాహన అవ్వటం చాలా కష్టం. మన అహంకారంతోటి, మన అజ్ఞానంతోటి, మన మనస్సుతోటి ఎంత సహజంగా తాదాత్మ్యం పొందుతున్నామో అంత సహజంగా లోపలఉన్న పరమాత్మతోటి తాదాత్మ్యం వచ్చేవరకూ భగవద్గీతలోని మాటలు ఎన్ని చెప్పినా మనకి అర్థముకాదు. అది సత్యమైనా అసత్యము వలె కనిపిస్తుంది. మనస్సుతోటి మనకి తాదాత్మ్యం ఉంది కాబట్టి అదే నిజం అనుకుంటున్నాము కనుక దానిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయము. ప్రయత్నం చేసినట్లు నటిస్తాము అంతే.

పుణ్యం బంగారపు సంకెళ్ళు, పాపం ఇనుప సంకెళ్ళు ఇవి రెండూ బంధిస్తాయి. ఈ పుణ్యపాపాలు దేహము, ఇంద్రియాలు, మనస్సు కలిసి చేస్తాయి. లోపలఉన్న ఆత్మకి వీటితోటి సంబంధంలేదు. అందుచేత మీరు లోపలఉన్న ఆత్మను తెలుసుకోవాలంటే మీరు దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి చేసిన పనులు ఈ భూమి మీదే వదిలేయండి. లోపల పరమాత్మతోటి మీకు తాదాత్మ్యం ఉన్నప్పుడు, నేను చేస్తున్నాను అనే తలంపు లేనప్పుడు మూడు లోకాలని భస్మం చేసినా నీకు పాపము లేదు అన్నాడు పరమాత్మ. అయితే ఆశక్తి పరమాత్మకి, పరమాత్మని తెలుసుకున్నవాడికి వస్తుంది కాని జీవకోటికి అది సాధ్యంకాదు. మీకు శరీరంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, చావుపుట్టుకలతోటి ఎంత సహజంగా తాదాత్మ్యం ఉందో అంత సహజంగా నీ హృదయంలో ఉన్న సత్యంతోటి తాదాత్మ్యం పొందటానికి నువ్వు ప్రయత్నం చేయటమే నీ సాధన యొక్క గమ్యం. అర్జునా నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో, నీ అహంకారం ఎలా చెబితే అలా చేయకు, వినయంగా ఉండటం నేర్చుకో, ధర్మాన్ని ఆచరించటం నేర్చుకో, ధర్మం అంటే కేవలం దానం అనికాదు. జీవిత విధానం, భగవంతుడు చెప్పిన పని చెయ్యటం, భగవంతుడు వద్దని చెప్పిన పని మానేయటం అది ధర్మం. ధర్మాన్ని నువ్వు ఆచరిస్తే నీ చదువులతోటి, వేదాలతోటి సంబంధం లేకుండా విషయ చింతన తగ్గిపోయి ఆత్మచింతన పెరుగుతుంది. నువ్వు ధర్మాన్ని ఆచరించవనుకో నీకు ఎంత డబ్బు ఉన్నా, పాండిత్యం ఉన్నా విషయచింతన పెరిగిపోతూ ఉంటుంది, ఆత్మచింతన తగ్గుతూ ఉంటుంది. వాల్మీకి రామాయణంలో ఆత్మజ్ఞానం కంటే, మోక్షం కంటే ధర్మం గురించి ఎక్కువ చెప్పాడు. ధర్మాన్ని

ఆచరించకుండా జ్ఞానంరాదు అని చెప్పాడు. రాముడి పట్టాభిషేకం చెడగొట్టి భరతుడికి పట్టాభిషేకం చేయాలనే తలంపు కైకకు కలగలేదు, మంధరకి కలిగింది. వాల్మీకి ఋషి అరచేతిలో ఉన్న వస్తువుని ఎంత స్పష్టంగా చూడగలమో అలా వాడి హృదయంలో ఉన్న సత్యాన్ని దర్శించిన వాడిని ఋషి అంటారు. వాల్మీకి ఏమని చెప్పాడు అంటే రాముడిని అరణ్యవాసానికి పంపాలని కుట్ర పన్నటానికి మందర కైక విశ్రాంతి గదిలోకి నడిచి వెడుతోంది, అక్కడ మంధర నడవటంలేదు రావణాసురుడు చేసిన పాపం మంధర రూపం ధరించి అడుగులు వేసుకొంటూ కైక గదిలోనికి నడిచివెడుతోంది అని చెప్పాడు. ఎందుచేతనంటే రాముడిని బయటకు పంపకపోతే అరణ్యానికి వెళ్ళడు, అరణ్యానికి వెళ్ళకపోతే రావణాసురుడు సీతను తీసుకొనివెళ్ళటానికి అవకాశం లేదు. అక్కడ రావణాసురుడి సంహారం జరగదు. మనం మంధర అలా చేసింది, ఇలా చేసింది అనుకుంటాము కాని రావణాసురుడు చేసిన పాపాలు ఒక రూపం ధరించి వచ్చింది అదే మంధర అంటాడు వాల్మీకి. అది మనం ఊహించలేము. భగవంతుడు రావణాసురుడిని సంహారం చేయటానికి మంధరని ఇక్కడ కల్పించాడని చెప్పటం, ఈ మాటలో ఉన్న అందాన్నే మనం భరించలేకపోతున్నాము, ఇంక ఆత్మని ఎక్కడ భరించగలము.

వాల్మీకి రామాయణంలో భరతుడు గురించి చెప్తాడు వాడు కష్టాలు అనుభవించటానికి, అందరిచేత మాటలు అనిపించుకోవటానికే పుట్టాడు అన్నాడు. భరతుడు మేనమామల ఇంటి దగ్గర ఉండగా కైక భరతుడికి పట్టాభిషేకం చెయ్యమని అడిగింది. ఇది భరతుడికి తెలియదు. కాని భరతుడికి తెలయకుండా తల్లి ఈ పని చేసిందా ఈ కుట్రలో భరతుడు ఉన్నాడని ప్రపంచానికి అనుమానం వచ్చింది. ఈ మాటలు భరిస్తున్నాడు, అందరిచేత అనుమానించబడుతున్నాడు పోనీ ఈ గొడవలు అన్నీ వదిలి, సుఖంగా ఉందాము అనుకుంటే రాముడు అరణ్యానికి వెళ్ళి తిరిగి వచ్చేవరకు పరిపాలన చేయవలసి వచ్చింది. రాముడు పాదుకలు సింహాసనం మీద పెట్టి భరతుడు పరిపాలన చేసాడు. భరతుడు అందరిచేత అవమానాలు పడుతున్నప్పటికీ తన ధర్మమార్గం విడిచిపెట్టలేదు. తులసీదాసుగారు అన్నారు అందరూ రామరామ అనుకుంటారు కానీ రాముడు మాత్రం భరత, భరతా అనుకుంటాడు. వాడు భరతుడు. భరతుడు హృదయం ప్రజలకు తెలియకపోయినా దేవుడికి తెలుసుకదా. మనం దేవుడిని స్మరిస్తూ ఉంటే దేవుడు భరతుడిని స్మరిస్తున్నాడు. ఎందుచేతనంటే భరతుడు లోకానికి సంబంధించిన మనిషికాదు, ఆయనా దేవుడే. అజ్ఞానం ఉంటే జీవుడు, జ్ఞానం ఉంటే దేవుడు. నువ్వు అజ్ఞానంలోంచి బయటకు రా దేవుడితో సమానం అవుతావు. మన మనస్సు శాంతిగా లేదు అనుకోండి మనకి ఇష్టమైనా వస్తుంది, అయిష్టమైనా వస్తుంది, బయటనుంచి ఏమైనా గొడవలు వస్తే ఉద్రేకం వచ్చేస్తుంది. మన మనస్సు శాంతిగా ఉంది అనుకోండి. బయట గొడవలు ఏమి వచ్చినా మనకు ఏమీ అనిపించదు. మీకు ఇష్టాలు, అయిష్టాలు ఎక్కువగా ఉంటే తగ్గించుకోండి, ఇష్టాలు అయిష్టాలు ఎక్కువ అవుతూ ఉంటే మనస్సులో చాపల్యం పెరిగిపోతుంది. మీరు

నిర్మలంగా కూర్చుని లోపల మీ మనస్సు ఎలా ఉందో చూసుకోండి. మనస్సు ఎటైనా కదులుతోంది అనుకోండి మీకు అక్కడ ఇష్టమైనా ఉండాలి, అయిష్టమైనా ఉండాలి. లేకపోతే మనస్సు కదలదు. మన చావు పట్టుకలకు కూడా ఈ ఇష్టాయిష్టాలే కారణమని మనకి తెలియటంలేదు. మీ జీవితం పొడుగునా ఎవరికోసమైతే కష్టపడ్డారో వారు మీ శరీరం చనిపోయినప్పుడు స్మశానానికి కూడా రారు. ఈలోపు మీరు వాళ్ళగురించి మీ మనస్సును కుళ్ళబెట్టుకొంటున్నారు. ఈ కుళ్ళబెట్టుకున్న మనస్సు మనకూడా వచ్చేస్తుంది. మనలో ఒక్క వాసన ఉంటే అనేక జన్మలు పీడించేస్తుంది. చెడ్డ తెచ్చుకోవటం తేలిక, దానిని వదిలించుకోవటం చాలా కష్టం. నువ్వు సమానబుద్ధిని ప్రాక్టీసు చెయ్యి. రాగద్వేషాలు తగ్గించుకో. నీకు రాగద్వేషాలు లేకపోతే నీ బుద్ధికి చాపల్యం తగ్గిపోతుంది, మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది, ఇంద్రియనిగ్రహం నీకు అలవాటు అవుతుంది.

పాండిత్యం ఉంటే సరిపోదు, వివేకం ఉంటే సరిపోదు. వైరాగ్యం ఉంటే సరిపోదు సదాచారం ఉండాలి. సదాచారం లేనివాడు ఆచార్యుడు కాలేడు. వాడు ఏ ఆనందాన్ని అయితే పొందుతున్నాడో, ఆ స్థాయిలోనికి మిమ్మల్ని తీసుకువెళ్ళటమే ఆచార్యుడు చేసేపని. పరమేశ్వరుడు ఆయన హృదయంలోనికి లాక్కుంటే మనం వెళ్ళగలం కాని ఇంటిదగ్గర కూర్చుని పీక్కుంటే ఆయన దగ్గరకు వెళ్ళలేము. పరమాత్మ యొక్క దయను సంపాదిస్తే, ఆయన హృదయంలో మనకి చోటు ఇస్తే మనం అక్కడకు వెళ్ళగలము. కొంతమందికి ఏమీ పని ఉండదు. వాళ్ళ దగ్గర కూర్చుంటాము అనుకోండి, వాళ్ళని వాళ్ళు పొగుడుకుంటూ ఉంటారు. అటువంటప్పుడు మనం అబద్ధాలు చెప్పి బయటకు వెళ్ళినా పాపంలేదు. ఎందుచేత పాపం లేదు అంటే మనల్ని మనం రక్షించుకోవటంకోసం బయటకు వెడుతున్నాం కాని వారికి మనం ఏమీ చెడ్డ చేయటంలేదు. అక్కడ అది సాధించాము, ఇక్కడ ఇది సాధించాము అని చెబుతూ ఉంటారు. వాడి హృదయంలో ఏమి ఉందో వాడికి తెలియటంలేదు. ఇంక వాడు ఏమి సాధించాడు? పోనీ సాధించాడు. దేనితోటి సాధించాడు. దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి సాధించాడు. ఆ మూడూ వాడుకాదు, ఆ మూడూ ఎంత నిజమో ఆ మూడింటితోటి సాధించే గొడవలు కూడా అంతే నిజం. ఇది అంతా నిజంకాదని జ్ఞానం యొక్క తూకం తెలిసినవాడికి తెలుస్తుంది.

యోగం అంటే ఏమిటి అంటే నువ్వు ఏ పని చేసినా ఆ పనిచేత నువ్వు బంధింపబడ కూడదు. నువ్వు సమత్వం అలవాటు చేసుకొంటే, రాగద్వేషాలు తగ్గించుకొని పని చేస్తూ ఉంటే నువ్వు చేసే పని నిన్ను బంధించదు. పుణ్యపాపాలు సంకెళ్ళులాంటివి. నువ్వు పని చేసేటప్పుడు నీకు పుణ్యం అంటుకోకూడదు, పాపం అంటుకోకూడదు. అంటుకొంటే అవి నిన్ను విడిచిపెట్టవు. అందుచేత నువ్వు పని చేస్తూ ఉండాలి దానిచేత నువ్వు బంధింపబడ కూడదు. అలా నేర్చుకొని నువ్వు పని చేస్తే అదే యోగము. వాలి భార్య వాలికి మంచి చెప్పేది

అలాగే రావణాసురుడి భార్య రావణాసురుడికి మంచి చెప్పేది. అలా మంచి చెప్పి తరువాత వాళ్ళ ప్రారబ్ధం ఎలా ఉంటే అలా అవుతుంది అని వదిలేసేవారు అంతేగాని వారు భగవంతుడు పాదాలు ఎప్పడూ విడిచిపెట్టలేదు. అవసరమైనపుడు మాట్లాడాలి, అవసరం లేనప్పడు మౌనంగా ఉండాలి అలా మన డ్యూటీ చెయ్యాలి. అంతేగాని ఏదో నాలుగు రోజులు జాగ్రత్తగా ఉండి ఇంద్రియాలను జయించేసాం, మనస్సుని జయించేసాం అని అనుకోకండి. మీకు తెలియకుండా లోపల వాసన ఉంటుంది. మీరు చిన్నప్పడు మాంసం, చేపలు ఇష్టంగా తిన్నారు అనుకోండి ఇప్పడు ఆరోగ్యంకోసమో, పాపం అనో మానేసారు అనుకోండి అంత మాత్రంచేత అవి జయించేసామని అనుకోకండి. మీరు చేపలు ఇప్పడు తినటం లేదని దాని వాసన పోయిందని అనుకోవద్దు. అలా అనుకుంటే ప్రమాదంలో పడతారు. మీ నోరు మటుకు తినటంలేదు. అలాగని మీకు చేపలమీద ఇష్టం పోయిందని అనుకోవద్దు. భగవంతుడు ముందు జాగ్రత్తకోసం చెబుతున్నాడు. అది వాసన రూపంలో ఉండిపోతుంది. ఆ వాసనలు ఒక జన్మలో పోవు. మీ లోపల అంతర్యామిగా ఉన్న పరమాత్మ అనుభవం మీకు కలిగినప్పడు ఆ వాసన పోతుంది కాని అప్పటివరకూ అది పోయిందని నమ్మటానికి వీలులేదు. మళ్ళీ అది ఎప్పడైనా విజృంభించవచ్చు. ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా విజృంభించవచ్చు. మీరు బాహ్యంగా ఇంద్రియాలతోటి విషయాలు ముట్టుకోకపోయినా మేము జయించేసాము అని అనుకోకండి. అవి బయట గొడవలే, మీ లోపల ఇంకా చాలా గొడవ ఉంది. ఆ లోపల ఉన్న గొడవ వచ్చే జన్మలో కూడా మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఏ జన్మలో అయితే మీకు పరమాత్మ దర్శనం అయ్యిందో అప్పడు ఆ వాసనలు నశిస్తాయి.

సూర్యుడు భూమికంటే పెద్దవాడు అయినా సూర్యుడిని ఒక చిన్న మేఘం మన కళ్ళకి కనబడకుండా చేయగలదు. అలాగే మన హృదయంలో ఉన్న పరమాత్మని మనకి అనుభవంలోనికి రాకుండా ఈ మనస్సు అడ్డుపడుతోంది. మనస్సు చిరిగిపోయే వరకూ అది అడ్డుపడటం మానదు. మీరు మృదువుగా హృదయంతోటి మాట్లాడుతున్నారు అనుకోండి మీరు హితవుగా, మితంగా మాట్లాడుతూ ఉంటే, మీరు చేసేపని సైలెంట్‌గా చేస్తూ ఉంటే ఇవన్నీ నెమ్మదిగా మనస్సు చిరిగిపోవటానికి మనకి సహాయం చేస్తాయి. అంటే మీ చేతలు, మీ మనస్సు, మీ మాట మనస్సు చిరిగిపోవటానికి ఉపయోగించుకోండి. కొంతమంది మంచి పనులు చేసినా మనస్సులో ఏదో స్వార్థం పెట్టుకొని చేస్తారు. దాని వలన పుణ్యం రావచ్చు కాని మనస్సు పలచబడదు, చిరగదు, మనస్సు గట్టిపడిపోతూ ఉంటుంది. మలదోషం, విక్షేపదోషం, ఆవరణదోషం ఈ మూడు మనిషి వెంట నీడ వచ్చినట్లు, ఆత్మజ్ఞానం కలిగేవరకూ ప్రతీ జన్మలో వెంటాడుతూ ఉంటాయి. శరీరంలో మలం ఎలా ఉంటుందో అలాగ మనస్సులో కూడా మలం ఉంటుంది. శరీరంలో ఉన్న మలం ఇనిమా చేసుకుంటే పోతుంది కాని మనస్సులో ఉన్న మలం అలా పోదు. అనేక జన్మల నుంచి మనం చేస్తున్న నిషిద్ధకర్మలు అలా మలంగా

మారిపోతాయి. అందులోంచి మనం ఎంతకాలమైతే విడుదల పొందలేమో అంతకాలం మనకి జ్ఞానం రాదు. ఆ మలదోషం పోవాలంటే ఈశ్వరుడి దయ, గురువు అనుగ్రహం ఉంటేకాని ఆ మలం పోదు. మన శరీరం ఒకచోట ఉంటుంది, మనస్సు ఒకచోట ఉంటుంది అది విక్షేపదోషం. ఈ దోషం ఉన్నా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. నిరంతరం మీ ఇష్టదైవాన్ని ప్రార్థించుకోవటం వలన విక్షేప దోషం పోతుంది. అన్నిటికంటే ఆవరణ దోషం పోవటం చాలా కష్టం. నావాళ్ళు, పరాయివాళ్ళు అని స్వపరభేదం కలిగి ఉండటం ఆవరణ దోషం. ఉన్న సత్యం ఉన్నట్టుగా మీకు గోచరించేవరకూ ఆవరణ దోషం పోదు. ఏరకంగా అయినా ఈ మూడు దోషాలలో నుండి మన లోపల ఉన్న అంతఃకరణం విడుదల అయితేగాని మనకి జ్ఞానంరాదు. ఈ మూడు దోషాలలో నుండి బయటపడితేగాని మనం చేసిన సాధన సక్సెస్ అవ్వదు. అయితే ఫెయిల్ అయినా మనం ప్రయత్నం మానకూడదు. అలా సాధన చేస్తూ చేస్తూ ఉంటే వీళ్ళు కష్టపడి సాధన చేస్తున్నారు అని గురువు అనుగ్రహం ఎప్పుడో సడన్‌గా వస్తుంది. మీరు టీచింగ్ శ్రద్ధగా శ్రవణం చేస్తూ ఉంటే ఇది అభ్యాసం చెయ్యాలి అని ఇంటరెస్ట్ కలుగుతుంది. మనం అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. లోపల ఉన్న సద్వస్తువు మనకి అనుభవంలోనికి రావాలి, ఈ జన్మలోనే మనం అది సాధించాలి అనే పట్టుదల మీ బుద్ధికి వస్తే మీ అభివృద్ధిని ఎవరూ ఆపుచేయలేరు. మీకు ఆ బుద్ధి రావటం వలన తొందరగా బాగుపడతారు. జ్ఞానం అనే అగ్ని మీ లోపల నుంచి ఉదయించాలి. లోపల నుంచి జ్ఞానం ఉబికి, ఉబికి మీ సహస్రారాన్ని ముంచేస్తూ ఉంటే ఒకవేళ దోషాలు అనే కట్టెలు ఉన్నా, బలహీనతలు అనే పిడకలు ఉన్నా అవి జ్ఞానాగ్నిలో కాలిపోతాయి అంటాడు పరమేశ్వరుడు. మళ్ళీ మీరు శరీరం ధరించి అనుభవించనక్కరలేకుండా కాలిపోతాయి, జ్ఞానాగ్ని అటువంటిది. జ్ఞానంతోటి సమానమైనది ఈ లోకంలోకాని, పరలోకంలోగాని ఏదీలేదు, అటువంటి జ్ఞానాన్ని సముపార్జించు అర్జునా అది సత్యజ్ఞానం అన్నాడు పరమాత్మ.

రామకృష్ణపరమహంస ఏమన్నారు అంటే పిల్లలు స్థంభాన్ని చేత్తోపట్టుకొని స్థంభం చుట్టూ స్పీడుగా తిరుగుతూ ఉంటారు వాళ్ళకి పడిపోతామనే భయంకూడా ఉండదు. అలాగే మీరు మీ మనస్సుని భగవంతుడు పాదాలకి కట్టేసుకొని మీ సంసార పనులు చూసుకోండి అప్పడు పడిపోతామనే భయం ఉండదు. ఎందుచేతనంటే అక్కడ పరమాత్మ ఆధారంగా ఉన్నాడు. మీకు ఒకవేళ దుఃఖం వచ్చినా ఏమీ అనిపించదు, భోగం వచ్చినా ఏమీ అనిపించదు. అక్కడ పరమాత్మ సపోర్టు ఉంది. భక్తుడి లక్షణాలు నువ్వు కూడా సంపాదించుకో. నువ్వు ఎవ్వరినీ భయపెట్టవద్దు, ఎవ్వరికీ నువ్వు భయపడకు, నీమీద ఇష్టంలేని వాళ్ళు, నీ పట్ల అసూయ ఉన్నవాళ్ళు నీకు అశాంతి, ఉద్రేకం కలగచేయటానికి వాళ్ళు పని చేస్తూ ఉంటారు. అప్పడు కూడా నువ్వు వికారం లేకుండా ఉండు. అది భక్తుడి లక్షణం, అది నువ్వు సంపాదించుకో అర్జునా అన్నాడు పరమాత్మ. రమణమహర్షిగారిని ఎవరైనా విమర్శించినా

ప్రశాంతంగా ఉండేవారు. మిమ్మల్ని విమర్శించినా మీరు ఎందుకు ప్రశాంతంగా ఉంటున్నారు అని అడిగితే ఆయన ఏమనేవారు అంటే వాళ్ళు ఎందుకు విమర్శిస్తున్నారో మీకు అర్థమవ్వకపోయినా నాకు అర్థం అయినప్పుడు అశాంతి ఎందుకు వస్తుంది అన్నారు.

మీ లోపల ఏ వాసన ఉందో మీకు తెలియదు. అది తలంపు కింద వచ్చిన తరువాత మీకు తెలుస్తుంది. అది మీ లోపల వాసనగా ఉన్నప్పడే చూస్తాడు వాడే గురువు, వాడే దేవుడు. వాసన చాలా బలీయంగా ఉంటుంది, లోపల అణిగి ఉంటుంది. పరమాత్మ దర్శనం అయ్యేవరకూ అది కాలి బూడిద అవ్వదు. మనస్సుని రెచ్చగొట్టకు. మనస్సుని, ఇంద్రియాలను శాంతిగా ఉంచుకో. నువ్వు రాక్షస తిండి తినకు. మనకి చేతిమీద పుండు పడితే ఆ పుండు మీదే ఆయింటుమెంటు రాసుకుంటాము కాని ఒళ్ళంతా రాసేసుకోము అలాగే నీ ఆకలికి సరిపడే తిను. మితంగా, యుక్తంగా తిను. నీ శరీరాన్ని, నీ మనస్సునీ అనారోగ్యానికి గురికానివ్వవద్దు. పరమాత్మ దర్శనానికి ఈ రెండింటిని ఉపయోగించుకో. ఆరోగ్యం చెడిపోతే ఇంక నువ్వు సాధనకు పనికిరావు. కొంతమందికి నోరు ఒకటే ఉంటుంది కానీ నాలుకలు పది ఉంటాయి. రోజుకి పది రకాలుగా మాట్లాడతారు. వాళ్ళని నువ్వు అనుకరించకు. అవినయం రాకుండా చూసుకో. ఎక్కువ ఖరీదైన బట్టలు కట్టవద్దు, సాధారణ వస్త్రాలే ధరించు. బావుందని రాక్షసులు తిన్నట్టు ఎక్కువ తినేయకు. దాని వలన నీ మనస్సు పాడైపోతుంది. నీ పని ఏదో నువ్వు చేసుకుంటూ ఎక్కడా ఆసక్తి పెట్టుకోవద్దు. అది ఎప్పుడు జరగాలో, ఎక్కడ జరగాలో, ఎలా జరగాలో అలా జరుగుతూ ఉంటుంది. భగవంతుడు ఒకవేళ మీ పనికి ఫలితం ఇవ్వటానికి లేటు చేస్తే మన మంచికోసమే లేటు చేస్తున్నాడని అనుకోండి. నిదానంగా ఉండండి, తొందరపాటు పనికిరాదు. ఇతరుల పనులలోకి మీరు వెళ్ళకండి. మీ పనులేవో మీరు శ్రద్ధగా చేసుకోండి మీ పనులలో లోపాలు ఉంటే సవరించుకోండి. ఇతరులను అనుకరించకండి. నీ స్వధర్మమేదో నువ్వు చూచుకో. ఆ రకంగా జీవిస్తూ ఉంటే నువ్వు చనిపోయేటప్పుడు శాంతిగా చనిపోతావు. భగవంతుడు నీకు ఏ పని అయితే అప్పగించాడో ఆ పని వదిలేసి ఎవరో ఏదో పని చేస్తున్నారని ఆ పనిలోనికి వెళతాను అంటే నువ్వు చనిపోయేటప్పుడు దుఃఖపడుతూ, అశాంతితోటి చస్తావు. ఐన్‌స్టీన్ చనిపోయినప్పుడు ప్రశాంతంగా చనిపోయాడు. వాడు జీవితం పొడుగునా స్వధర్మంలోనే ఉన్నాడు, పరధర్మంలోనికి వెళ్ళలేదు. ఐన్‌స్టీన్‌కి ప్రధానమంత్రి పదవి, గవర్నరు పదవి ఇస్తానంటే నేను చేసేది అంతా చేతులతోటి చేసేపనికాదు మెదడుతో చేసేపనికి నేను అలవాటు పడ్డాను నాకు భగవంతుడు ఈ పని కేటాయించాడు అని స్వధర్మం వదిలి పెట్టలేదు. అందుకే చనిపోయేటప్పుడు ప్రశాంతంగా చనిపోయాడు. భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే బయట గొడవలు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అది వచ్చి నీ మనస్సుని ముట్టుకోకూడదు. అవి దేహప్రారబ్ధాన్నిబట్టి వస్తాయి. స్వధర్మాన్ని కాపాడుకోవాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 23 | సత్యసాయి నిగమ్, హైదరాబాద్ (శ్రీ నాన్నగారి పుట్టినరోజు) |
| అక్టోబర్ | 2 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



శ్రీ శైలంలో సద్గురు శ్రీ నాన్నగారితో
ఆంధ్రప్రదేశ్ దేవాలయముల కమీషనర్
జె.యస్.వి. ప్రసాద్‌గారు

# గురువును కపటం లేకుండా ప్రేమించటమే – తపస్సు

ఈ ప్రపంచంలో నిజమైన ప్రేమ అరుదు. మనం ప్రాపంచిక బంధనాలను సాధ్యమైనంతవరకూ తెంచుకొంటేగాని గురువు మీద ప్రేమ తిరగదు. ప్రేమలో జీవితాన్ని త్యాగం చెయ్యవలసి ఉంటుంది. ప్రతిఫలం ఆశించకుండా గురువును ప్రేమించాలి. తల్లి తన బిడ్డను తన గర్భంలో పూర్ణత్వంకోసం కొంతకాలం ఉంచుకొంటుంది. గురువుకూడా శిష్యుడిని తన మానసిక పరిధిలో కొంతకాలం ఉంచుకొంటాడు. ఆ సమయంలో గురువు నుంచి శక్తిని గ్రహిస్తాడు. ఆయన యోచనా తరంగాల నుండి పోషణను గ్రహించి పరిణితి చెందుతాడు. గురువుకు మనం ఇష్టమైతేనే మనం ఆయనను నిరంతరం ప్రేమించగలము. నిత్యసహచరునిగా చేసుకోగలము. గురు ప్రేమలో తనలో అణువణువునా ఆరాధించేజ్ఞానస్వరూపుడైన గురువు తానుగా నిలిచే అవకాశం ఉంటుంది. గురువు తేలిక పదాలతో అపరిమితమైన తత్త్వాన్ని తెలిపేటప్పడు స్థిర నిశ్చయంతో అంతరంగంలో ఉంటే సత్యాన్ని తప్పక గ్రహిస్తాడు. దివ్యపురుషుడైన గురువును మనం చూడటం వల్ల మన మనస్సు సూక్ష్మమూ-శుద్ధమూ అవుతుంది. అప్పడు బాధా తప్తహృదయుడై ఆయన కృపను, కరుణను అర్థిస్తూ ప్రార్థన సలపాలి. ఇది విజయసాధనకు అత్యంత తిరుగులేని ఉపాయం. దాని ద్వారా మనం పవిత్రులమై ఆయనతో సంబంధం ఏర్పడుతుంది. శ్రీనాన్నగారు "అహంకారం నమ్రత వల్ల గురు ప్రేమ స్పర్శ వల్ల మాత్రమే నశిస్తుంది. కర్మ, జ్ఞాన, యోగాలవల్ల పూర్తిగా నశించదు. సద్గురువును ప్రేమగా తలచుకొంటేచాలు మీ సాధన జయప్రదమౌతుంది. ఒకజ్ఞాని కరుణ మన మీద పడితే ఒక్క క్షణంలో జ్ఞానం వస్తుంది" అన్నారు. గురువుకు శరణాగతి కావాలి మన మనోబుద్ధులను ఆయనకు సమర్పించాలి వారి ఆదేశాలను శిరసావహించాలి. జాలి హృదయం నుంచే నైతిక ప్రవర్తన వస్తుంది దానితో మనం ఉత్సాహంగా ఉంటాము. భక్తి పరిపూర్ణమైతే ప్రేమ. అది నిజమైతే పూజలు, కర్మకాండలు తపస్సులు ప్రేమ లేనిదే శూన్యం. గురుగోవింద్‌సింగ్ "ప్రేమ మార్గాన్ని అనుసరించిన వారు మాత్రమే పరమాత్మను పొందుతారు" అన్నారు. కొంగ పిల్లలను వదలి ఎంతదూరం వెళ్ళినా అలాగే తాబేలు గుడ్లుపెట్టి సముద్రంలోకి వెళ్ళినా వాటి ధ్యాస పిల్లలమీదే ఉంటుంది. అలాగే గురువు ధ్యాస ఎప్పడు తన శిష్యులమీదనే ఉంటుంది. శిష్యుడు దూరంలో ఉన్నా సమస్యలేదు. రక్షణ అభయహస్తాలు ఎప్పడూ ఉంటాయి. మనం నిర్మల ప్రేమ పూరితంగా ఉంటాము. గురువు ముక్తికి దాతలు వారిపై ధ్యానం అన్ని మలినాలను కడిగి శుభ్రం చేస్తుంది. అజ్ఞాన తెర తొలగుతుంది. కష్టసుఖాలను కావడికుండలుగా భావించే శక్తి అలవడుతుంది. శాంతి పరిమళిస్తుంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం